క్లుప్తంగా

దుస్తుల పంపిణీ



కమలాపూర్: మండలంలోని ఉప్పల్‌కు చెందిన పూసాల వరలక్ష్మీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ చైర్మన్ పూసాల ప్రకాశం, ఆయన మనుమడు పూసాల ఇషాన్ జన్మదినం సందర్భంగా బుధవారం అనాథ పిల్లలకు దుస్తులు పంపిణీ చేశారు. హనుమకొండ సుబేదారిలోని బాల సదన్ (అనాథ ఆశ్రమం), లష్కర్ బజార్‌లోని విశు విహార్‌లోని 35 మంది అనాథ పిల్లలకు రూ.20 వేల విలువ గల దుస్తులుతో పాటు ఇతర సామగ్రి అందించారు.

గుడుంబా విక్రయదారుడికి జరిమానా



వేలేరు: గుడుంబా విక్రయిస్తున్న ఓ వ్యక్తికి తహసీల్దార్ హెచ్.కొమి భారీ జరిమానా విధించారు. ఎక్సైజ్ శాఖ ఎస్సై మమత తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పీచర శివారు వావిల్లకుంట తండాలో గుడుంబా విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు తండాలో తనిఖీలు నిర్వహించగా గుగులోతు లింగయ్య గుడుంబా విక్రయిస్తూ పట్టుబడ్డాడు. పట్టుకున్న గుడుంబాను సీజ్ చేసి లింగయ్యను తహసీల్దార్ ఎదుట హాజరుపర్చగా అతడికి రూ.30 వేల జరిమానా విధించారు. కాగా, లింగయ్య గతంలో కూడా పలుమార్లు గుడుంబా విక్రయిస్తూ పట్టుబడినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది కోటిలింగం, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

ఐనవోలు/ శాయంపేట: పీఆర్టీయూ రాష్ట్ర శాఖలో ఐనవోలు మండల ఉపాధ్యాయులకు అవకాశం లభించింది. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా వెంకటాపూర్ జెడ్పీహెచ్ఎస్ నుంచి తిరునగరి సూరి బాబు, సింగారం జెడ్పీహెచ్ఎస్ నుంచి అలిగిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, పంథిని జెడ్పీహెచ్ఎస్ నుంచి గుడికందుల సమ్మయ్య, నందనం ఎంపీపీఎస్ నుంచి వేల్పుల కొమురయ్యకు అవకాశం కల్పించినట్లు మండల అధ్యక్షుడు గుర్రపు రాజు, ప్రధాన కార్యదర్శి జూలూరి చంద్రమోహన్ తెలిపారు. కాగా, రాష్ట్ర శాఖ అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, సహకరించిన జిల్లా అధ్యక్షుడు మండల తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పలిత శ్రీహరిలకు ఐనవోలు మండల శాఖ తరపున కృతజ్ఞతలు తెలిపారు. శాయంపేట మండలంలోని కాట్రపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల బయోసైన్స్ ఉపాధ్యాయుడు డాక్టర్ చల్లా రాజిరెడ్డి అసోసియేట్ అధ్యక్షుడిగా నియమితులయ్యారు.

హోంగార్డు కుమార్తెకు సీపీ అభినందనలు



వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని ఎంటీ విభాగంలో డ్రైవర్‌గా పనిచేస్తున్న హోంగార్డు గుంటికంటి కుమారస్వామి కుమార్తె ఇటీవల జరిగిన మెడికల్ కౌన్సెలింగ్‌లో హంటర్‌రోడ్డులోని కొలంబో మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఈమేరకు వర్షితను సీపీ అభినందించారు.

సరుకుల అందజేత

మడికొండ: మడికొండ గ్రామానికి చెందిన గుడికందుల మానస్విత కాలు రోడ్డు ప్రమాదంలో విరిగింది. బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ఆ కుటుంబానికి నెలకు సరిపడా నిత్యావసర సరుకులను మడికొండ పోలీసుస్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న జయరాజ్ అందజేశారు.

విద్యార్థికి ఆర్థిక సాయం



విద్యారణ్యపురి: సంగెం మండలానికి చెందిన నిరుపేద విద్యార్థి బొమ్మగాని నాగరుత్విక్ గౌడ్‌కు స్టడీ మెటీరియల్ నిమిత్తం హనుమకొండలోని విద్యా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బిల్ల మహేందర్, సలహాదారుడు గురిజాల తిరుపతిరెడ్డి రూ.10 వేలు అందజేశారు. వడ్డేపెల్లిలోని ఒయాసిస్ అనాథాశ్రమంలో జరిగిన కార్యక్రమంలో ఫౌండేషన్ బాధ్యులు కలకోట్ల నరేందర్, సభ్యులు ఉదయశ్రీ ప్రభాకర్, కూరపాటి రమేష్, ప్రభాకర్, స్వరూప, బుచ్చయ్య, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ దశలోనే..

- నిధుల కొరతతో అసంపూర్తిగా మోడల్ మార్కెట్ పనులు
- పట్టించుకోని పాలకులు



నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోయిన మోడల్ మార్కెట్

పరకాల: నిధుల కొరతతో పరకాల నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడుతుంది. రూ.25కోట్ల నిధులతో పనులు ప్రారంభించిన పరకాల సివిల్ ఆస్పత్రితోపాటు రూ.3కోట్ల నిధులతో నిర్మాణం చేసిన మోడల్ మార్కెట్ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. రాజిపేట, సీతారాంపూర్ గ్రామాల విలీనంతో పరకాల మున్సిపాలిటీ విస్తీర్ణం పెరిగిపోయింది. 20 వార్డులు ఉన్న మున్సిపాలిటీ 22 వార్డులుగా మారింది. దీంతో గత ప్రభుత్వ హయాంలో 2022 సంవత్సరంలో పశువుల సంత మార్కెట్ సమీపంలోని గెస్ట్‌హౌజ్ ఆవరణలో మోడల్ మార్కెట్ నిర్మాణ పనులు ప్రారంభించారు. మోడల్ మార్కెట్‌కు రూ.3కోట్ల నిధులు మంజూరు చేశారు. కానీ, నిధులు సరిపోకపోవడంతో భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా వదిలేశారు. మరో రూ.2కోట్ల నిధులు మంజూరైతేనే మోడల్ మార్కెట్ పూర్తి అయి ప్రజలకు అందుబాటులోకి వస్తుందని మున్సిపల్ పాలకవర్గంలోని కొందరు సభ్యులు అభిప్రాయపడుతున్నారు. అయితే సంబంధిత కాంట్రాక్టర్‌కు రూ.కోటి50లక్షల బిల్లు మాత్రమే మంజూరు కావడంతోపాటు మిగతా నిర్మాణం, అంతర్గత పనులకు కొత్త ప్రభుత్వ నుంచి ఎలాంటి నిధులు మంజూరు చేయలేదు. దీంతో మోడల్ మార్కెట్ ఇప్పట్లో వినియోగదారులకు అందుబాటులోకి వచ్చే అవకాశాలు లేకుండాపోయింది.

నిధులు మంజూరు చేయాలి

మోడల్ మార్కెట్ నిర్మాణానికి కావాల్సిన నిధులను ప్రభుత్వం తక్షణమే మంజూరు చేయాలి. మోడల్ మార్కెట్ నిర్మాణంతో వందలాది మందికి ఉపాధి అవకాశాలు ఏర్పడటంతోపాటు వినియోగదారులకు ఉపయోగంగా ఉంటుంది. లేకపోతే కోట్లాది నిధులతో నిర్మాణం చేసిన మోడల్ మార్కెట్ నిరుపయోగంగా మారుతుంది.

– నక్క చిరంజీవి, బీఆర్‌టీయూ జిల్లా నాయకులు

చెరువుల పరిరక్షణ అందరి బాధ్యత

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే కడియం

ధర్మసాగర్: చెరువు, చేప పిల్లలు, ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండల కేంద్రంలోని రిజర్వాయర్‌లో మంగళవారం జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేపపిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో మత్స్య సంపద పెంచాలని తద్వారా మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం చేపలను దిగుమతి చేసుకునే స్థాయి నుంచి ఎగుమతి చేసే స్థాయికి ఎదగడం శుభ పరిణామమని పేర్కొన్నారు. మత్స్యకార సంఘాల్లో సభ్యులైన ప్రతీ ఒక్కరికి రూ.5 లక్షల ఉచిత ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. దేవాదుల ప్రాజెక్టులో మొట్టమొదటి రిజర్వాయర్ ధర్మసాగర్‌దే అని ఈ రిజర్వాయర్ సాగు నీటితోపాటు తాగు నీటిని కూడా అందిస్తుందని వివరించారు. రెండేళ్లలో దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేసి స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని ప్రతీ ఎకరాకు రెండు పంటలకు సాగు నీరు అందించే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. త్వరలోనే నక్కల తూము ద్వారా ధర్మసాగర్ రైతులకు సాగు నీరు అందిస్తామన్నారు. ప్రకృతి అందాలతో కూడిన రిజర్వాయర్, దేవునూర్ గుట్టలను కలిపి ఎకో టూరిజం ప్రాజెక్టు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించా రు. రిజర్వాయర్‌కు నాలుగు వైపులా ఉన్న కాల్వల ద్వారా చేపలు వెళ్లిపోకుండా ఉండడానికి అవసరమైన ఫెన్సింగ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, చేపల మార్కెట్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని గుర్తించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సదానందం, ఎంపీడీఓ అనిల్ కుమార్, మత్స్య శాఖ అధికారులు, కార్మిక సంఘం అధ్యక్షుడు సుధాకర్, డైరెక్టర్లు, ముదిరాజ్ కులస్తులు, కాంగ్రెస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

చే గువేరాకు ఘన నివాళి

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్ ఆధ్వర్యంలో చే గువేరా 57వ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చేగువేరా చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలు



వేలేరు: అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



ఆత్మకూరు: కాళరాత్రి అవతారంలో దుర్గామాత

- వివిధ రూపాల్లో అమ్మవారి దర్శనం
- నిత్యం పూజలు నిర్వహిస్తున్న భక్తులు



పరకాల: అన్నదానం ప్రారంభిస్తున్న ఆర్డీఓ

పరకాల: పరకాల పట్టణంలోని కనకదుర్గమ్మ మదన పోచమ్మ ఆలయంలో దేవి శరన్నవ రాత్రి ఉత్సావాల్లో భాగంగా బుధవారం అమ్మవారు సరస్వతీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పూజల అనంతరం పులుమాటి కిరణ్‌కుమార్, ఏడీఎంఎస్ షోరూం యాజమాన్యం ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదానం కార్యక్రమాన్ని ఆర్డీఓ కె.నారాయణ ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బండి సారంగపాణి, దేవునూరి మేఘనాథ్, నాగెల్లి రంజిత్, మూసినపల్లి శివప్రసాద్, కంచం రవితేజ, సత్యం, పింటు దాసరి సాయి, రాకేశ్, వరప్రసాద్, మనోహర్, పప్పులు తదితరులు పాల్గొన్నారు.

సరస్వతిమాత అవతారంలో..

వేలేరు: మండల కేంద్రంలో అమ్మభవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవిశరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు సరస్వతిమాత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. ఈసందర్భంగా భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు, సరస్వతీ పూజ, నిత్య కుంకుమార్చన, నిత్యారాధన, హోమం అర్చకులు సంతోశ్ చౌదరి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం డైరెక్టర్ సంధ్య భూపతి రాజు, ముదిరాజ్ సంఘం యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్, పిట్టల రాజు, జీడయ్య, తిరుపతి, అనిల్, అరవింద్, సంపత్, రమేశ్, తిరుమలేశ్, రమేశ్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

కాళరాత్రి అవతారంలో..

ఆత్మకూరు: మండలకేంద్రంలో దుర్గాదేవి శరన్నవ రాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం దుర్గామాత కాళరాత్రి అవతారంలో దర్శనమిచ్చారు. భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు.

మాజీ సర్పంచ్ ఇంట్లో చోరీ



వేలి ముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

శాయంపేట: శాయంపేట మాజీ సర్పంచ్ వలద్రాసు చంద్రమౌళి ఇంట్లో చోరీ జరిగిన సంఘటన బుధవారం ఆలస్యంగా వెలుగు చూసింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. చంద్రమౌళి గుండె నొప్పితో బాధపడుతుండడంతో నెల రోజుల క్రితం ఇంటికి తాళం వేసి చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. ఇటీవల శస్త్ర చికిత్స జరిగింది. బుధవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయి ఇంటికి వస్తుండడంతో ఇంటిని శుభ్రం చేయాలని చంద్రమౌళి మరదలు మిట్టపల్లి విజయనిర్మలకు చెప్పారు. ఆమె వెళ్లి చూసేసరికి తలుపులు తెరుచుకొని ఉండడం, ఇంట్లో సామగ్రి చిందరవందరగా పడి ఉండడంతో చంద్రమౌళి కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. దీంతో చంద్రమౌళి సూచన మేరకు మాజీ వార్డు సభ్యుడు శ్రీనివాస్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఎస్సై ప్రమోద్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని ఇంటి తలుపుల స్క్రూలు తొలగించబడి ఉండడంతో చోరీ జరిగినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న శాయంపేట సీఐ రంజిత్‌రావు సందర్శించి సంఘటనపై దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీం వచ్చి వేలిముద్రలు సేకరణ చేపట్టింది. ఎస్సై ప్రమోద్‌కుమార్ కుటుంబ సభ్యులతో విచారణ చేపట్టారు.

రాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్న సీపీ



పూజలు నిర్వహిస్తున్న సీపీ దంపతులు

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలోని అత్యంత పురాతనమైన కాకతీయ కాలంలో నిర్మించిన రాజరాజేశ్వర స్వామి ఆలయాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా బుధవారం రాత్రి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు తాటిపాముల అనుదీప్ శర్మ పూర్ణకుంభంతో స్వాగతం పలికి అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాగణంలో దేవిశరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఏర్పాటు కాళీకామాత అవతారంలోని దుర్గామాతను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలన్నారు. ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని తెలిపారు. కార్యక్రమంలో పరకాల ఏసీపీ కిషోర్‌కుమార్, శాయంపేట సీఐ రంజిత్ రావు, ఎస్సై ప్రమోద్‌కుమార్, సామాజిక సేవకుడు అమ్మ అశోక్, మాజీ సర్పంచ్ అబ్బు ప్రకాశ్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ వెంటనే చేపట్టాలి

హన్మకొండ అర్బన్: డీఎస్సీ ఉద్యోగ నియామకాల్లో భాగంగా తక్షణమే ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ఎంఎస్పీ జాతీయ నేత మందకుమార్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్ర భిక్షపతి డిమాండ్ చేశారు. ఈమేరకు మాదిగలకు ఇచ్చిన మాటను సీఎం రేవంత్‌రెడ్డి తప్పినందుకు నిరసనగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బండారు సురేందర్ మాదిగ ఆధ్వర్యంలో అంబేడ్కర్ సెంటర్ నుంచి అమరవీరుల స్థూపం మీదుగా కలెక్టరేట్ వరకు నల్లజెండాలతో బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జాతీయ నేత వేల్పుల సూరన్న, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్, ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకులు పుట్ట రవి, మంద రాజు, ఎంఎస్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శులు బొక్కల నారాయణ, గంగారపు శ్రీనివాస్, ఎంఈఎఫ్ జాతీయ నాయకుడు కుమ్మరి రాజయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు శాంతిసాగర్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సద్దుల బతుకమ్మకు సర్వం సిద్ధం



పరకాల: వేడుకలకు ముస్తాబైన సంత ప్రాంగణం



రంగులు కొనుగోలు చేస్తున్న మహిళలు



కమలాపూర్ : పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు

- ఏర్పాట్లు చేసిన అధికారులు, సిబ్బంది
- పూలు, రంగుల సేకరణలో బిజీగా ఆడపడుచులు
- సందడిగా మారిన సంతలు



పరకాల: పూల కొనుగోలు చేస్తున్న జనంతో రద్దీగా పరకాల కూరగాయల మార్కెట్

పరకాల: సద్దుల బతుకమ్మ వేడుకలకు పరకాల పట్టణంలోని శ్రీకుంకుమేశ్వర స్వామి ప్రాంగణం(పశువుల సంత)లో ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో రూ.30 లక్షల నిధులు ఖర్చు చేసి పశువుల సంత, దామెర చెరువు దగ్గర లైటింగ్, సౌండ్ సిస్టం, వేదిక ఏర్పాట్లు చేపట్టారు. అదే విధంగా బతుకమ్మ తయారీ కోసం కావాల్సిన పూలు, రంగులు కోసం మార్కెట్‌కు జనం పెద్ద సంఖ్యలో తరలిరావడంతో పరకాల పట్టణంలోని మార్కెట్ రోడ్డు రద్దీగా మారింది. ఇదిలా ఉండగా.. పరకాల పశువుల సంత, బతుకమ్మను నిమజ్జనం చేసే దామెర చెరువు ట్యాంక్‌బండ్‌ను వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ పి.రవీందర్, మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ, ఏసీపీ కిషోర్‌కుమార్ పరిశీలించారు .

కమలాపూర్ మండలంలో..

కమలాపూర్: మండల వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ గుండె బాబు, సీఐ హరికృష్ణ తెలిపారు. కమలాపూర్ పెద్ద చెరువు వద్ద గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ నిర్వహణకు చేసిన ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కమలాపూర్‌తోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో సద్దుల బతుకమ్మ నిర్వహణ కోసం ఆయా గ్రామాల చెరువులు, బతుకమ్మ ఆడే ప్రదేశాల వద్ద స్థలాన్ని చదును చేసి విద్యుత్ దీపాలు అమర్చినట్లు తెలిపారు. కమలాపూర్‌లో సద్దుల బతుకమ్మ సందర్భంగా పెద్ద చెరువు కట్టపై మహిళలు బతుకమ్మ ఆడే సమయంలో ద్విచక్ర వాహనదారులు చెరువు కట్టపైకి వెళ్లకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నామని, సద్దుల బతుకమ్మ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ రవి, ఈఓ రమణారెడ్డి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

శాయంపేట : మండల కేంద్రంలోని తాళ్లకుంట చెరువు శిఖము, ఆరెపల్లి, మైలారం ప్రాంగణంలో నిర్వహించే సద్దుల బతుకమ్మ వేడుకలకు సర్వం సిద్ధం చేసినట్లు తహసీల్దార్ కల్వల సత్యనారాయణ తెలిపారు. బుధవారం పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్‌తో కలిసి సద్దుల బతుకమ్మ మైదానాన్ని సందర్శించి పరిశీలించారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా హైమాస్ లైట్లు ఎక్కువగా ఏర్పాటు చేయాలని, చిన్న పిల్లలు చెరువు వద్దకు రాకుండా భారీకేడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మహిళలు బతుకమ్మ నిమజ్జనానికి చెరువులోకి దిగకుండా మల్టీ పర్పస్ సిబ్బంది చెరువు వద్ద అందుబాటులో ఉంచాలని తెలిపారు. మైదానంలోకి పురుషులు రాకుండా చూడాలని, మహిళలు స్వేచ్ఛగా ఆడుకునేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రాంగణాన్ని చదును చేయించడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను పంచాయతీ కార్యదర్శి రత్నాకర్‌కు వివరించారు.

కర్ణాటకలో బతుకమ్మ సందడి

ధర్మసాగర్: మండలంతోపాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలో పని చేస్తున్న ఇగ్నైటెడ్ మైండ్స్ సంస్థకు చెందిన 26మంది ఉపాధ్యాయ కుటుంబాలు కర్ణాటకలోని ప్రఖ్యాతి మురుడేశ్వర దేవాలయంలో బుధవారం బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. దసరా సెలవులను విజ్ఞాన వినోద మేలవింపులతో గడిపేందుకు ఉపాధ్యాయులు ఆయా ప్రాంత పాఠశాలలను సందర్శిస్తూ అక్కడి విద్యా విధానాలు పాఠ్యాంశాలను అధ్యయనం చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ సంస్థ అధ్యక్షుడు రావుల శ్రీధర్, వీరరాఘవులు, వెంగళ మురళి, శివ రతన్ సింగ్, మాధవి, ధర్మప్రకాశ్ పాల్గొన్నారు.

పూల జాతర..

కమలాపూర్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సందర్భంగా గ్రామాల్లో పూల సందడి మొదలైంది. ఒకప్పుడు విరివిగా దొరికే తంగేడు, గునుగు, గుమ్మడి, బంతి, చామంతి, సీతజడ తదితర పూలు నేడు అరుదుగా దొరుకుతున్నాయి. దీంతో కొందరు వ్యాపారులు సుదూర ప్రాంతాల నుంచి పూలను తీసుకొచ్చి మార్కెట్లలో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. గురువారం సద్దుల బతుకమ్మ కావడంతో కమలాపూర్ గుడిబండ వద్ద నిర్వహించే మార్కెట్ ప్రాంతం బుధవారం సాయంత్రం పూల సంతగా మారింది. ప్రకృతిని ఆరాధించే బతుకమ్మ పండుగ కోసం పూల విక్రయదారులు, కొనుగోళ్ల కోసం వచ్చిన ఆడపడుచులతో మార్కెట్ ప్రాంతం కిక్కిరిసిపోయింది.



శాయంపేటలో తాళ్లకుంట చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్



ధర్మసాగర్: కర్ణాటకలో బతుకమ్మ సంబురాల్లో ఉపాధ్యాయుల కుటుంబ సభ్యులు



పరకాల: దామెర చెరువు ట్యాంక్‌బండ్‌ను పరిశీలిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్

విద్యుత్ తీగలు తెగిపడి సామగ్రి దగ్ధం

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని మహేశ్వరంలో రెండురోజుల క్రితం విద్యుత్ తీగలు తెగిపడడంతో పలువురి ఇళ్లలోని టీవీలు, ఫ్రిజ్‌లు, ఫ్యాన్‌లు, మీటర్లు కాలిపోయాయని పలువురు వాపోయారు. దీంతో రూ.50వేల ఆస్తి నష్టం జరిగిందని, పరిహారం ఇప్పించి, కొత్త మీటర్లను బిగించాలని సీపీఎం మండల కార్యదర్శి కొరబోయిన కుమారస్వామి డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఈసందర్భంగా కోరారు. అనంతరం మహేశ్వరం సబ్ స్టేషన్ ఎదుట సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించి వినతిపత్రాన్ని కార్యాలయంలో అందించారు. నాయకులు మలహాల్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, కొలువుల శివకుమార్, రుద్రారపు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ పూజ

మామునూరు: ఖిలా వరంగల్ మండలం మామునూరు పోలీస్ శిక్షణ కళాశాలలో ఏర్పాటు చేసిన సరస్వతీ విగ్రహావిష్కరణ కార్యక్రమం బుధవారం జరిగింది. ముఖ్యఅతిథిగా పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ (ఎస్పీ) హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. అలాగే, నూతనంగా ఏర్పాటు చేసిన రిసెప్షన్ కౌంటర్‌ను ప్రారంభించారు. డీఎస్పీలు రమేష్, వెంకటేశ్వర్‌రావు, రవీందర్, భిక్షపతి, పాండునాయక్, చంద్రశేఖర్, నవీన్, విజయ్, కాశిరాం, రమేష్, సత్యనారాయణ, నరేష్‌కుమార్, సుధాకర్, కల్పనరెడ్డి, సుధీర్, దశరథం, సుధాకర్, యుగేందర్ పాల్గొన్నారు.